# జస్ట్... 'మిస్'

నాగమణికి పదో క్లాసు చదువుతుండగానే వాళ్ల బావ రమేశంతో పెళ్లయింది. రమేశంకి పక్కబస్తీలో చిన్న ఉద్యోగం. ఇంటర్ ఫెయిలయినా, సిన్సియర్‌గా పనిచేయటం వల్ల ఏడు వందలు జీతం తెచ్చుకునే స్థాయికి చేరుకున్నాడు.

పెళ్లికానప్పుడు ఖర్చులెక్కువ ఉండేవి కావు. పొదుపుగా ఉంటూ

రెండు మూడు వేలు దాచుకుని వడ్డీ తిప్పుతూ కొంత డబ్బు పెంచాడు. మావయ్యో పదివేలు కట్నం ఇచ్చాడు. అదీ వడ్డీలు తెచ్చి పెడుతోంది. ఏతావాతా నెలకి వెయ్యి, పన్నెండొందలపైనే ఆదాయం వస్తుంది. ఉన్నంతలో హాయిగానే ఉంటున్నారు. కానీ నాగమణి హాయిగా ఉండలేక పోతోంది. పిల్లలు కలిగి పెద్దవాళ్లయ్యే నాటికి తన ఇంటిని సమస్త సదుపాయాలతో నింపెయ్యాలని సతాయిస్తూంటోంది!

బతిమాలాడు!

బుజ్జగించాడు!!

కోప్పడ్డాడు!!

భార్య మనసు మార్చలేక, దుబాయ్ వెళ్ళటానికి నిర్ణయించు కున్నాడు. భార్య గెలిచింది! భర్త ఓడి బొంబాయి వెళ్లే రైలెక్కాడు. పోగేసుకున్న డబ్బులన్నీ ఊడ్చి మావని కాసిన్ని డబ్బులడిగి పెళ్లాన్ని పుట్టింట్లో దింపి... రమేశం వెళ్లిపోయాడు.

రమేశం 2, 3 నెలలు పోయాక ఓ చోట పని దొరికిందనీ మూడు నెలల్లో డబ్బు పంపిస్తాననీ రాశాడు. అన్నట్లుగానే ఎవరో వస్తోంటే కొంత డబ్బు పంపించాడు. ఆ తర్వాత రెండుసార్లు ఉత్తరంలో 'నేను వచ్చేస్తానే టిక్కెట్టు కోసం డబ్బు అట్టే పెట్టుకుంటాన'ని రాశాడు. నాగమణి చివాట్లెడుతూ జాబు రాసింది. 'డబ్బు పంపించమ'ని!

రమేశం ఏమనుకున్నాడో... ఏవయ్యాడోగానీ... మరి ఉత్తరాలు రాయలేదు. నాగమణికి మొగుడుతత్వం తెల్సు కనక, డబ్బు చెట్టుని నాటి పండించటం అతనికి తెల్సు అని తెల్సు కనక, అక్కడ కరెన్సీపాతి మన రూపాయలు పండిస్తాడని, పంపిస్తాడనీ కూడా నమ్మకంగా ఉంది.

పైగా తనంటే చచ్చేంత ప్రేమ. నాగమణి అందం మీద... తనకన్నా భర్తకే ఎక్కువ నమ్మకం, ప్రేమ.

ఏడాది గడిచింది. తండ్రి చనిపోయాడు. అప్పుడు ఏడిచేడిచి కొంచెం సేపు మొగుడొచ్చి ఓదారిస్తే బావుణ్ణనిపించింది. పైగా రమేశానికి మావయ్య అంటే చాల ఇష్టం. కానీ ఈ వార్త తెలియకుండానే మావయ్య దినాలైపోయాయి.

నాగమణికి కొంచెం కొంచెం తెలిసొచ్చింది.

నాన్న పోయాక ఆ ఇంట్లో తన స్థానం ఏమిటో?!

వేరెళ్ళిపోయిన అన్నయ్య ముందు కన్నీళ్ళెట్టుకుంది!

"నాకు తెల్సి నీ మొగుడింక రాడు! ఎందుకంటే... అతను వెళ్ళనంటే డబ్బే ముఖ్యమని... నువ్వే పంపావు... అతను వస్తానంటే భర్తే ముఖ్యం అనుకోకుండా... వద్దన్నావు"

"అయితే ఇప్పుడేవంటావ్"

"నువ్ కూడా ఏదైనా పన్లో చేరు. నీ మొగుడొచ్చేదాకా ఉద్యోగం చేసుకో, చూడు చెల్లాయ్... సంపాదించిన జీతంలో నీ తిండికి పోనూ మిగిలిన డబ్బులు నీ మొగుణ్ణి రమ్మని రాయటానికి పోస్టు ఖర్చులకి వినియోగించు"

నాగమణి మనస్సు ఏడిచింది. అన్నయ్య ఇలా మాట్లాడతాడని అనుకోలేదు.

కానీ నాగమణి ఎవ్వరి నీతులూ వినదు. ఎవరి మొట్టికాయలూ తినదు.

"సరే నాకేదైనా ఉద్యోగం చూపించు. ఎలా ఖర్చు పెట్టాలో చెప్పావుగా" నిష్ఠూరంగా, ఉక్రోషంగా అంది నాగమణి.

నాగమణికి రోజులు గడుస్తున్న కొద్దీ టెన్షన్ మొదలవుతోంది. మొగుడికో ఉత్తరం రాసింది గానీ... జవాబింకా రాలేదు. ఈలోగా అన్నయ్య ఫ్రెండ్ రామాచారి గుర్తొచ్చాడు. ఆయనకి ఊళ్లో కొంత పలుకుబడి ఉంది. అతనికి కొంత హెల్పింగ్ నేచరూ ఉంది.

నాగమణి కథ విని అయ్యో అనుకున్నాడు.

చక్కటి పిల్ల! ఎక్కడికైనా ఉద్యోగానికి పంపినా... మగాళ్ల నుండి ఎలా తట్టుకొస్తుందో.

"ఏదైనా... ఉద్యోగం ఇప్పించండి రామంగారూ. మా అన్నయ్య ఫ్రెండ్‌గా నాకీ హెల్ప్ చేయాలి మీరు"

రామాచారి క్షణం సేపు మాట్లాడలేదు. అమ్మాయి ఎవర్నయినా ఇంత ప్రాధేయపడితే తప్పకుండా ఎక్స్‌ప్లాయిట్ చేస్తారని భయం వేసిందతనికి.

"నువ్వు చదివిందా.. టెన్త్! ఏ ట్యూషన్లైనా చెప్పుకుంటే నెలకో పది మందికి అఆలు, అంకెలూ దిద్దిస్తే ఓ రెండు వందలు రావచ్చేమో ట్రై చేద్దామా..."

"నెలంతా వాళ్లతో అరచీ... రెండొందలు వచ్చినా..." అసంతృప్తిగా అంది నాగమణి.

"ఓకే... నాకు తెల్సున్న ఒకాయన బీడీలు చుట్టి కంపెనీలకు పంపిస్తాడు. నెలకి మూడొందలు పైనే దొరకచ్చు. ఇమీడియట్ సోర్స్ అంటే... నాకు అదే జ్ఞాపకం వస్తోంది... కానీ..."

"చెప్పు రామం ఏంటి?''

"అతను ఆడాళ్ల విషయంలో మంచివాడు కాదంటారు. అందుకనే బాగా వయస్సు మళ్లినవాళ్లు తప్ప అతని దగ్గర ఉద్యోగం చేయట్లేదని ఓ పుకారు కూడా ఉంది''

"భలే వాడివే రామం... ఆడాళ్లు తల్చుకుంటే రావణాసురుణ్నే గడ్డి పరకతో సమానంగా చూడగలరు ఏమైనా చేయగలరు. నువ్ భయపడకు''

'నాగమణి ధైర్యం నాగమణికన్నా అందంగా ఉంది' అనుకున్నాడు రామాచారి.

"సరే... నేను అతనితో వెళ్లి మాట్లాడతాను. నువ్ రేపెల్లి పనిలో జాయినవ్వు. ఒక్క మాట... నీకు ఏరోజు అక్కడ పని చేయడం ఇష్టం లేదో... అప్పుడు తక్షణం మానెయ్యి. నీకు రావల్సిన డబ్బు అణా కాణీల్తో... ఇప్పించే బాధ్యత నాది'' అన్నాడు రామం.

నాగమణి "థేంక్స్'' చెప్పి వెళ్లింది.

ఆ సాయంత్రం రామాచారి బీడీ చుట్టే సత్యం చావడికెళ్లాడు. "నాకు చాలా ముఖ్యిరాలు... వాళ్లన్నయ్య నా ఫ్రెండ్. వాళ్ల నాన్న నాకు గురువు. మన పిల్ల పరాయి చోటికి వెళ్తం కన్నా...'' ఏదో చెప్పబోయాడు రామాచారి.

"నువ్వేం భయపడకు బ్రదర్, నువ్ చెప్పేవంటే ఆ పిల్ల ఎంత ఇదో తెలుస్తోంది. రేపు మార్నింగ్ రమ్మను. ఎంత పని చేస్తే అంత ఆదాయం.''

"నువ్ కాదనవని నాకు తెలుసు. అందుకే రేపు మార్నింగ్ నిన్ను కలవమన్నాను."

"గుడ్..." సత్యం రామాచారిని సాదరంగా సాగనంపాడు.

రామాచారికి మనస్సులో సత్యం మీద భయం ఉంది. అయితే పనిస్తానన్నవాడు మహానుభావుడు. డబ్బిస్తున్నవాడు దేవుడు- అని నాగమణికి మేలు జరగాలనుకున్నాడు.

నాగమణి ఇంటికెళ్లి "నువ్ వెళ్లు మణీ జాగ్రత్త... నీకెప్పుడు ఆ జాబ్ నచ్చకపోతే అప్పుడొచ్చేయ్" అని చెప్పాడు.

రామంకన్నా నాగమణి ధైర్యంగానే ఉంది.

"సరే వెళ్లొస్తాను" అంటూ కదిలాడు.

"టీ తాగి వెళ్దురు గాని..."

"వద్దులే. ఇది టీ టైము కాదుగా..."

"మరే టైము??" చాల అందంగా నవ్వుతూ అడిగింది.

"ఏం లేదులే ఉంటానూ" తనేవన్నా తప్పుగా మాట్లాడతానేమోనని వచ్చేశాడు.

✦ ✦ ✦

సరిగ్గా రెండ్రోజులకు సత్యం వచ్చాడు.

"నాగమణి ఉద్యోగంలో జాయినయ్యిందా..."

"ఆ అమ్మాయి చాలా చురుకైంది..."

"పోన్లే పాపం... నెలకో మూడు నాలుగొందలు వస్తే..."

నవ్వాడు సత్యం. "అవును రామం నువ్వేం చెప్పావు ఆ అమ్మాయితో నా గురించి..."

రామం కంగారుగా "ఏం చెప్పాను?"

"నేనో పెద్ద రసికుణ్ణని చెప్పావుటగా"

షాకయ్యాడు. "నీతో చెప్పిందా... ఉద్యోగం మానేసిందా?" అని అడిగాడు.

లేదన్నట్లు నవ్వాడు సత్యం... అయోమయంగా చూశాడు రామం. "అదికాదు. నీతో చెప్పిందా? ఎప్పుడు చెప్పిందీ" అని అడిగాడు.

"మేమిద్దరం ఆనంద లోకాల్లో విహరించాక... నా చెమట తన చెంగుతో తుడుస్తూ చెప్పింది."

రామం చాల బాధ పడ్డాడు.

"ఏరా బాధపడుతున్నావా... నువ్ కనక నాగమణికి... నేనిలాటి వాణ్ణి అని చెప్పక పోతే నా ట్రయల్ సక్సెస్ అవటానికి చాలా డిలే అయ్యేది. బట్ నువ్ మా ఇద్దరికీ చాలా మేలు చేశావ్..."

రామం ఇంకేం వినట్లేదు. ఆ పిల్ల అలాంటిదని తెలిస్తే తనే నెలకి నాలుగొందల జీతం ఇచ్చేసేవాణ్ణి కదా... అని ఫీలవుతున్నాడు... ఆ అమ్మాయిని మిస్ చేసుకున్నందుకు.

నాగమణి ఏమవుతుంది! నాగమణి భర్త ఎప్పుడొస్తాడు అని ఎవరూ ఆలోచించట్లేదు... నాగమణితో సహా.

